

పర్యావరణ విధ్వంసం!

పెడన సీఆర్‌జెడ్ పరిధిలో అక్రమార్కుల నిర్వాకం

మడ అడవులు నరికి యథేచ్ఛగా రొయ్యల చెరువుల తవ్వకం



మడ అడవులను నరికి సాగు చేస్తున్న రొయ్యల చెరువులు

పెడన కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జడ్) పరిధిలో పర్యావరణ విధ్వంసం పెద్ద ఎత్తున జరుగుతోంది. కొందరు అక్రమార్కులు మడ అడవులను నరికి అక్రమంగా రొయ్యల చెరువులు తవ్వుతున్నారు. యథేచ్ఛగా వనామీ రొయ్యల సాగు చేస్తున్నారు. వీటి పెరుగుదలకు మేతతో పాటు హైఫైడ్ కెమికల్‌ను వినియోగిస్తున్నారు. ఆ తర్వాత ఆ వ్యర్థనీటిని మడ అడవుల్లోకి వదులుతున్నారు. కెమికల్ నీటి వల్ల మడ చెట్లు కుళ్లిపోయి చనిపోతున్నాయి. ఎండిపోయిన చెట్లను తొలగించి అక్కడ మళ్లీ రొయ్యల చెరువులు తవ్వుతూ ముందుకుపోతున్నారు. దీంతో మడ అడవులు అంతరించిపోతున్నాయి.



అంతరించిపోతున్న మడ అడవులు

- వనామీ రొయ్యల సాగు.. హై ఫైడ్ రసాయనాల వినియోగం
- చెరువుల్లోని వ్యర్థ కెమికల్ నీరు మడ అడవుల్లోకి విడుదల
- ఆ నీటి వల్ల కుళ్లిపోయి చనిపోతున్న మడ చెట్లు
- ఎండిపోయిన చెట్లు తొలగించి అక్కడ కొత్తగా చెరువుల తవ్వకం
- మడ అడవులు అంతరించిపోవడంతో పొంచి ఉన్న పర్యావరణ ముప్పు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/పెడన రూరల్): కృష్ణా జిల్లాలో పెడన కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) పరిధిలో బందరు సముద్ర తీరం వరకు 15 వేల ఎకరాల మేర మడ అడవులు ఉన్నాయి. సీఆర్‌జెడ్, పీడబ్ల్యూడీ భూములలో ఈ మడ అడవులు ఉన్నాయి. పెడన మండలంలోని జింజేరు-1, జింజేరు-2 మీదుగా సాగే లజ్జబండ డ్రెయిన్‌కు రెండు వైపులా 15 వేల ఎకరాలలో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ మడ అడవులపై కొంత మంది అక్రమార్కులు కన్నేశారు. కొంత కాలంగా అడవులను నరికివేసి నాలుగైదు ఎకరాల విస్తీర్ణంలో రొయ్యల సాగు చేపడుతున్నారు. ఇలా కొన్నేళ్లుగా వేలాది ఎకరాల్లోని మడ చెట్లను నరికి రొయ్యల సాగు చేపట్టారు. వనామీ రొయ్యల సాగే ఎక్కువగా సాగవుతుంది. వనామీ రొయ్యలు ఎంత ఆహారాన్ని తినగలిగితే అంతగా పెరుగుతాయి. పరిమాణం ఎక్కువగా ఉండే వనామీ రొయ్యలకు విదేశాల్లో ఎంతో డిమాండ్ ఉంది. ఎగుమతులకు మంచి అవకాశం ఉండటంతో పాటు ధర కూడా భారీగా ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని వనామీ రొయ్యలకు మంచి పోషకాలున్న మేతను అందిస్తారు.

యథేచ్ఛగా హైఫైడ్ కెమికల్ వినియోగం

వనామీ రకం రొయ్యలు ఒక ప్రత్యేకమైన వాసనకు ఆకర్షితమవుతాయి. ఆ వాసన వచ్చే ఆహారాన్ని అమితంగా ఇష్టపడి తింటాయి. ఆ వాసన అనేది హైఫైడ్ అనే కెమికల్ నుంచి వస్తుంది. ఈ హై ఫైడ్ కెమికల్‌ను వనామీ రొయ్యల ఆకలిని పెంచటానికి, రొయ్యలకు వ్యాధులు రాకుండా ఉండటానికి ఉపయోగిస్తారు. మేతలో మిగతా 6లో..

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రైల్వేస్టేషన్, బైపాస్ ప్రాంతాలే కేంద్రాలుగా వ్యాపారం నిర్వహిస్తున్నారు. విక్రయదారులుగా మైనర్లు, మహిళలను వినియోగిస్తున్నారు. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. గంజాయి విక్రయించే ముఠాలకు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నట్టు విమర్శలు వస్తున్నాయి. గంజాయికి అలవాటుపడిన యువత మత్తులో వాహనాలను ఎలా నడుపుతున్నారో కూడా తెలియని స్థితిలోకి వెళ్లి ప్రమాదాలకు కారణమవుతున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



గంజాయ్!

మచిలీపట్నంలో జోరుగా గంజాయి విక్రయాలు

రైల్వేస్టేషన్, బైపాస్ ప్రాంతాలే కేంద్రాలుగా..

- విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయవాడ నుంచి దిగుమతి
- విక్రయదారులుగా మైనర్లు, మహిళలు
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న పోలీసులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నంలో గంజాయి ముఠాలు రెచ్చిపోతున్నాయి. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయవాడ, తదితర ప్రాంతాల నుంచి గంజాయి దిగుమతి చేసుకుంటున్నాయి. శ్రీకాకుళం తదితర జిల్లాలకు చెందిన వారు మచిలీపట్నం వలసవచ్చి ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఆ జిల్లాలో ఉన్న మిగతా 6లో..

206 పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

కృష్ణాజిల్లాలో 113, ఎన్టీఆర్ జిల్లాలో 93

- మిగిలిన సొసైటీలకు త్వరలో నియామకాలు

మచిలీపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాలోని 206 పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు)లకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరి పదవీ కాలం తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు లేదా పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరిగే వరకు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇటీవల ఉమ్మడి జిల్లాలోని పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలను రెండు, మూడు విడతల్లో ప్రభుత్వం నియమించింది. వీరి పదవీ కాలాన్ని 2026, జనవరి 30వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం జూలై 30వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది.

కృష్ణాజిల్లాలో 30, ఎన్టీఆర్ జిల్లాలో 28 పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలను ఇంకా నియమించాల్సి ఉంది. కీలకమైన పీఏసీఎస్‌లలో పోటీ అధికంగా ఉండటంతో శాసన సభ్యులు ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అయితే పెండింగ్‌లో ఉన్న పీఏసీఎస్‌లకు కూడా త్రిసభ్య కమిటీలను సాధ్యమైనంత త్వరగా నియమిస్తారనే మిగతా 6లో..

పెండింగ్‌లో మరో 58 సొసైటీలు

లక్ష రూపాయల పెట్టుబడికి నెలకు రూ.6వేలు వడ్డీ వస్తుందని ఆశ చూపించిన అద్వికా ట్రేడింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఖాతాదారులను ముంచేసింది. అద్వికా కొట్టిన దెబ్బకు షాక్‌లోకి వెళ్లిన బాధితులకు న్యాయం చేయడానికి సిట్(ప్రత్యేక దర్యాప్తు బృందం) పనులు ప్రారంభించింది. అద్వికకు అంకురార్పణ జరిగింది మొదలు, ఖాతాదారులను నిట్టనిలువునా ముంచేసే వరకు జరిగిన ప్రక్రియను దశల వారీగా బట్టబయలు చేయబోతోంది. త్వరలో ఏజెంట్లు, ఖాతాదారులతో అధికారులు ముఖాముఖి నిర్వహించనున్నారు.

అద్వికా సిట్‌ంగ్!

ఏజెంట్లు, ఖాతాదారులకు తాఖీదులు!

- 2వేల మందిని విచారించనున్న అధికారులు
- ఇప్పటి వరకు 150 మంది వాంగ్మూలం నమోదు
- దుబాయ్ ఖజానాలో ఇరుక్కున్న రూ. 3కోట్లు
- సిట్ చీఫ్‌కు రిపోర్టు చేసిన ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు




ఆదిత్య

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): అద్విక ట్రేడింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ మోసానికి సంబంధించి మాచవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో వేగాన్ని పెంచడానికి పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు 21 మందితో సిట్‌ను ఏర్పాటు చేశారు. దీనికి చీఫ్‌గా క్రైమ్ డీసీపీ తిరుమలేశ్వర్‌రెడ్డిని నియమించారు. సిట్‌లో ఉన్న పది మంది ఇన్‌స్పెక్టర్లు, 11 ఎస్ఐలు ఆదివారం సిట్ చీఫ్ వద్ద రిపోర్టు చేశారు. ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు చేయాల్సిన పనులకు సంబంధించి ఈ సందర్భంగా ఆయన దిశానిర్దేశం చేశారు. అద్వికలోకి మొత్తం రూ.500 కోట్ల వరకు వచ్చినట్టు ఇప్పటికే నిర్ధారించారని సమాచారం. ఇందులో ఒక రూ.400 కోట్ల వరకు చెల్లింపులు చేసినట్టు తేలిందని విశ్వసనీయంగా తెలిసింది. మిగిలిన మిగతా 6లో..

ఖాతా నుంచి ఖాతాకు..

అద్విక ఎండీ ఆదిత్య కార్యాలయంలో పోలీసులకు దొరక్కుండా రికార్డులను మాయం చేసినా లావాదేవీలను మాత్రం చెరపలేకపోయాడు. అద్వికకు వచ్చిన నగదు, ఖాతాదారులు, ఏజెంట్లకు వెళ్లిన నగదు మొత్తం ఖాతాల ద్వారా జరిగింది. చాలా స్వల్ప సంఖ్యలో ఖాతాదారులు మాత్రమే నగదు రూపంలో చెల్లించారు. ఆదిత్య రికార్డులను మాయం చేయగానే పోలీసులు బ్యాంకుల నుంచి వివరాలు రప్పించుకుని లావాదేవీలను భద్రం చేశారు.



బ్యారేజీకి పెరుగుతున్న వరద

ఎగువ నుంచి 67,346 క్యూసెక్కుల రాక

- 60 గేట్లను అడుగు మేరకు ఎత్తి 43,500 క్యూసెక్కుల విడుదల

విజయవాడ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీకి వరద తగ్గినట్టే తగ్గి పెరుగుతోంది. తెలంగాణలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పులిచింతల నుంచి 1,12,568 క్యూసెక్కుల నీటిని బ్యారేజీకి విడుదల చేస్తున్నారు. ఇక్కడ నీటిమట్టం 52.73 మీటర్ల వద్ద కొనసాగుతుంది. పులిచింతల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 42.72 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువన ఉన్న నాగార్జునసాగర్ నుంచి 71వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. సాగర్ ఎనిమిది గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీకి మాత్రం 67,346 క్యూసెక్కుల వరద వస్తోంది. బ్యారేజీ 60 గేట్లను అడుగు మేరకు ఎత్తి 43,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి 51,207 క్యూసెక్కులు, పాలేరు నుంచి 1413, కీసర మిగతా 6లో..

ప్రొఫెషనల్ ట్యాక్స్ బాదుడు!



స్థానిక సంస్థల నుంచి కమర్షియల్ ట్యాక్సెస్‌కు తిరిగి వసూళ్ల బాధ్యతలు

- నెల రోజులుగా ఉద్యోగులు, ఫ్రీలాన్సర్లు, వ్యాపారులకు డిమాండ్ నోటీసులు
- కట్టకపోతే ఖాతాలు స్తంభింపజేస్తామంటూ బెదిరింపులు
- ఒకేసారి భారం మోపవద్దంటున్న పన్నుదారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): స్థానిక సంస్థలు వసూలు చేయలేకపోయిన ప్రొఫెషనల్ ట్యాక్స్ (వృత్తిపన్ను)ను ఒక్కసారిగా పన్నుదారులపై మోపి బకాయిలు చెల్లించాలంటూ వాణిజ్యపన్నుల శాఖ అధికారులు డిమాండ్ నోటీసులు పంపారు. కట్టకపోతే ఖాతాలను నిలుపుదల చేస్తామంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పన్నుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. వృత్తిపన్ను అనేది మొదట్లో కమర్షియల్ టాక్సెస్ డిపార్ట్‌మెంట్ పరిధిలోనే ఉండేది. 2017లో జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చాక.. కమర్షియల్ ట్యాక్సెస్ డిపార్ట్‌మెంట్ నుంచి తొలగించి స్థానిక సంస్థలకు బదలాయించారు. విజయవాడ, మచిలీపట్నం కార్పొరేషన్లతో పాటు తిరువూరు, కొండపల్లి, నందిగామ, జగ్గయ్యపేట, ఉయ్యూరు, గుడివాడ, పెడన మునిసిపాలిటీల పరిధిలోనూ, స్థానిక గ్రామ పంచాయతీల పరిధిలోనూ వసూళ్లకు నిర్దేశించారు. స్థానిక సంస్థలకు బదలాయించిన తర్వాత వృత్తి పన్నును వసూలు చేయటంలో అవి తీవ్ర నిర్లక్ష్యం చూపాయి. వివిధ వృత్తులు, వ్యాపారాలు చేసే వారిపై విధించే ప్రత్యక్ష పన్నులలో వృత్తి పన్ను కూడా ఒకటి. ఈ పన్నును ఆదాయం ఆధారంగా విధించటం జరుగుతుంది. వృత్తి పన్ను అనేది ప్రభుత్వానికి ముఖ్యమైన ఆదాయ వనరుగా కూడా ఉంది. వృత్తి పన్నును నెలసరి జీతం పొందే ఉద్యోగులతో పాటు వృత్తిపరమైన వ్యక్తులుగా ఉండేవారు ఉదాహరణకు మిగతా 6లో..

కమర్షియల్ ట్యాక్సెస్ దూకుడు

ప్రభుత్వం ఇటీవల కాలంలో వృత్తి పన్ను వసూళ్లలో స్థానిక సంస్థలు వెనుకబడటం చూసి మళ్లీ కమర్షియల్ ట్యాక్సెస్ శాఖకు బాధ్యతలు బదలాయించటం జరిగింది. దీంతో కమర్షియల్ ట్యాక్సెస్ సిబ్బంది ప్రొఫెషనల్ ట్యాక్స్ వసూళ్లకు తెరలేపారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. వృత్తిపన్ను వసూళ్ల విషయంలో కమర్షియల్ ట్యాక్సెస్ అధికారులు దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఒక్కసారిగా బకాయిల బండ మోపి కట్టాలని డిమాండ్ చేస్తున్నారు. పాత బకాయిలన్నీ కలిపితే వేలాది రూపాయలు కట్టాల్సి వస్తోంది. వేతన జీవులకు, ఫ్రీలాన్సర్లకు ఇది ఇబ్బందిగా ఉంది. వేతన జీవులు చాలా మంది కనీస వేతనాలు కూడా అందుకోవటం లేదు. అసంఘటిత రంగంలో ఉద్యోగులకు గరిష్టంగా రూ.40 వేల జీతం కూడా రాదు. ప్రొఫెషనల్ ట్యాక్స్ బకాయిలు ఒక్కసారే వేల రూపాయలు చెల్లించాల్సి రావటం ఈ రెండు కేటగిరీల వారికి ఇబ్బందిగా మారుతోంది. కాబట్టి - వాయిదాల పద్ధతిలో కట్టుకునే అవకాశాన్ని కానీ, మరేదైనా పద్ధతిలో కానీ కట్టించుకోవాలి తప్ప.. ఒక్కసారిగా చెల్లించాలంటే వారెలా చెల్లించగలరన్నది ఆలోచించాల్సిన విషయం. ప్రభుత్వం జోక్యం చేసుకుని తక్షణం తమకు వృత్తి పన్ను చెల్లింపులకు సంబంధించి వెసులుబాటు కల్పించాలని పన్నుదారులు కోరుతున్నారు.

గీత కార్మికుల సంక్షేమమే లక్ష్యం

- మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ 6
- బార్లలో కల్లుగీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్‌పై హర్షం

సుబ్బారాయుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు

- ఒక్కరోజు ఆదాయం రూ.10 లక్షలు

6

గణేష్ ఉత్సవ సమితి కమిటీ ఏర్పాటు



నూతన వస్త్ర బహూకరణ వేడుకలో చిన్నారులతో చంద్రబాబు

నూతన వస్త్ర బహూకరణ వేడుకలో సీఎం చంద్రబాబు

పెనమలూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం పోరంకిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన అడుసుమిల్లి వారి నూతన వస్త్ర బహూకరణ వేడుకకు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. చిన్నారులు శౌర్య, ఇషాన్‌ల తల్లిదండ్రులు కోయ బాబూ రాజేంద్రప్రసాద్, షర్మిల దంపతులు, కుటుంబసభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్యమంత్రి కార్యక్రమానికి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ గంగాధరరావు, ఆర్డీవో హేలా షారోన్ తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.

నాలుగు దశాబ్దాల ఆత్మీయ బంధం

» వసంత నాగేశ్వరరావును కలిసిన జానారెడ్డి



వసంతను ఆత్మీయంగా పలకరిస్తున్న జానారెడ్డి

నందిగామ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుబంధం గల ఇద్దరు నేతలు ఆదివారం ఒకచోట కలిశారు. పరిస్థితులకనుగుణంగా వేర్వేరు మార్గాల్లో నడిచినా వారు స్నేహ ధర్మాన్ని మాత్రం వీడలేదు. ఇద్దరూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్ఠాత్మకమైన హోంశాఖను నిర్వహించడం విశేషం. ఒకరు తెలంగాణాకు చెందిన కుందూరి జానారెడ్డి కాగా, మరొకరు ఆంధ్రాకు చెందిన వసంత నాగేశ్వరరావు. ఆదివారం ఐతవరంలోని వసంత ఇంటికి వచ్చిన చిరకాల మిత్రుడు జానారెడ్డి కొద్దిసేపు ఆయనతో సరదాగా గడిపారు. 43ఏళ్ల నాటి రాజకీయ, కుటుంబ విషయాలను నెమరవేసుకున్నారు. ఒకానొక దశలో భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ జానారెడ్డిని శాలువాతో సత్కరించారు.



విజయలక్ష్మికి స్వాగతం పలుకుతున్న సర్పంచ్ నిడమర్తి సౌజన్య

విజయలక్ష్మికి ఘనస్వాగతం


గన్నవరం : మిసెస్ ఇండియా-2025 కప్పం విజయలక్ష్మికి గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. విజయలక్ష్మి ఆదివారం హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో ఇక్కడికి విచ్చేశారు. విమానాశ్రయంలో ఆమెకు పూలబొకేలు అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన విజయవాడ వెళ్లారు. పీఆర్కే ఫౌండేషన్ అధినేత పార రామకృష్ణ, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, నాగేశ్వరరావు తదితరులుస్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



ప్రభాకరరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే బోడె, కొనకళ్ల, వెలగపూడి

అనుమోలుకు నేతల అభినందన

పెనమలూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : అరవై ఏడేళ్ల వయసులో ఎల్‌బ్రస్ పర్వతాన్ని అధిరోహించి రికార్డు నెలకొల్పి అక్కడ టీడీపీ జెండా ఎగురవేసిన అనుమోలు ప్రభాకరరావుకు పలువురు టీడీపీ నేతలు అభినందనలు తెలిపారు. అనుమోలు శనివారం స్వదేశం చేరుకుని పర్వతారోహణలో తనఅనుభవాలను టీడీపీ నాయకులతో పంచుకున్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, వెలగపూడి శంకరబాబులు ఆయన్ను అభినందించారు.



స్వామివారి నిత్యశాంతి కళ్యాణంలో పాల్గొన్న భక్తులు

భక్తులతో పోటెత్తిన సుబ్బారాయుడి ఆలయం

» ఒక్కరోజు ఆదాయం రూ.10 లక్షలు

మోపిదేవి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం ప్రత్యేకత కావటంతో పలుప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులుతీరారు. నాగపుట్టలో పాలుపోసి విశేష పూజలు చేశారు. నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆదివారం ఒక్కరోజే రూ.10,00,605లు ఆదాయం సమకూరినట్టు ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గోకరాజు గంగరాజు, చలసాని ఆంజనేయులు

గణేష్ ఉత్సవ సమితి కమిటీ ఏర్పాటు

» గౌరవాధ్యక్షుడిగా గోకరాజు గంగరాజు

విజయవాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27 నుంచి ప్రారంభమయ్యే గణేష్ నవరాత్రి మహోత్సవాల నిర్వాహణకు గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటైంది. విజయవాడలో ఆదివారం జరిగిన సమావేశంలో సమితి గౌరవాధ్యక్షుడిగా మాజీ ఎంపీ గోకరాజు గంగరాజును ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పాకాల త్రినాథ్(ఏలూరు) ఎన్నికయ్యారు. కోశాధికారిగా కేవీ రమణ(విజయవాడ) ఎన్నికయ్యారు. వారు కాకుండా ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు కార్యదర్శులు, 23 మంది సభ్యులు ఎన్నికయ్యారు.



కీచక టీచర్లపై చర్యలేవీ!

» సోషల్ ఆడిట్ నివేదికలతో ఉలికిపాటు

» అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు స్పందించాలని తల్లిదండ్రుల వినతి

నందిగామ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల కీచకపర్వంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం స్థానికంగా చర్చనీయాంశమైంది. కొందరి నీచ ప్రవర్తన వల్ల ఉపాధ్యాయ ఖ్యాతి పాతాళానికి పడిపోతుందని పలువురు ఆవేదన చెందుతున్నారు. పాఠశాలల్లో కీచకుల అంశంపై ఉపాధ్యాయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఉపాధ్యాయ వృత్తికే తలవంపులు తెస్తున్న వారిపై అనుసరించాల్సిన వైఖరిపై నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల ఉపాధ్యాయ సంఘాలు చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది. పేద, మధ్యతరగతి పిల్లలు తమ బాధను తల్లిదండ్రులకు చెప్పుకోలేకపోతున్నారని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో సైతం ఇటువంటి ఘటనలు జరుగుతున్నా యాజమాన్యాలు, అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయినులు లైంగిక వేధింపుల బారిన పడుతున్నారని పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులు వ్యాఖ్యానిస్తున్నారు. కీచకోపాధ్యాయులపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోషల్ ఆడిట్ నిర్ణయంతో కీచక పర్వాలు వెలుగుచూస్తున్నాయని, నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థినుల సమాచారం గోప్యంగా ఉంచుతూ.. విద్యాశాఖ, పోలీసులకు వారిబాధలు తెలియజేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, దీనికి ఉపాధ్యాయ సంఘాలు సహకారం అందించి విద్యావ్యవస్థకు కళంకం రాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ట్యాబ్‌లను నిషేధించాలి

గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థుల ఉన్నత లక్ష్యం కోసం పంపిణీ చేసిన ట్యాబ్‌లు వారి పతనానికి కారణమవుతున్నాని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కొందరు విద్యార్థులు తరగతి గదుల్లోనే యూట్యూబ్ ద్వారా అశ్లీల చిత్రాలు తిలకించడం, విద్యార్థినులపై ర్యాగింగ్ చేయడం వంటి చేష్టలు చేస్తున్నారని సమాచారం. పలువురు విద్యార్థులు ట్యాబ్‌లను తప్పుగా వినియోగిస్తుండటంతో ఉపాధ్యాయులు సైతం ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం యూట్యూబ్ తరగతులు లేనందున ప్రభుత్వం ట్యాబ్‌ల వాడకాన్ని నిషేధించాల్సి ఉంది. పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ట్యాబ్‌లు గానీ, సెల్‌ఫోన్‌లు గానీ తేవడాన్ని పూర్తిగా నిషేధిస్తే మంచిదని కొందరు ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. యూట్యూబ్‌లతో పెడదారి పట్టిన విద్యార్థుల కారణంగా విద్యావ్యవస్థకే చెడ్డపేరు వస్తుందని, మంచి ఫలితాలు సాధించాలంటే ఇటువంటి వారిని కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది

అన్నదాతకు అండగా ప్రభుత్వం

» ఆర్థిక సాయం విడుదలపై హర్షం

» నందిగామలో భారీగా ట్రాక్టర్ ర్యాలీ

నందిగామ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవతో ఆర్థికసాయం అందించిన కూటమి ప్రభుత్వానికి అన్నదాతలు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన మాట



సమావేశంలో మాట్లాడుతున్న తంగిరాల సౌమ్య

ప్రకారం అన్నదాతలకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించిన ప్రభుత్వానికి రుణం తీర్చుకోవాలన్న ఆలోచనతో వందలాది ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల ఫ్లెక్సీలను ట్రాక్టర్లపై ఉంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుండి రైతులు ర్యాలీలో పాల్గొన్నారు. సామాన్య రైతులు సైతం ర్యాలీకి సంఘీభావం తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన రైతులకు లబ్ధి చేకూరింది. తమకు అండగా నిలిచిన ప్రభుత్వానికి అనుకూలంగా రైతులు వందలాది ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు.

వ్యవసాయ రంగం అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : సౌమ్య

ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బడ్జెట్‌లో అగ్రభాగం సాగునీటి రంగానికి నిధులు కేటాయించారన్నారు. ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రైతును రాజుగా చేసే వరకూ విశ్రమించరన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌పి ఎల్‌బిసి ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కంచికచర్ల, చందర్లపాడు, నందిగామ మండల టీడీపీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

హర్షాతిరేకాలు

గీత కార్మికుల సంక్షేమమే లక్ష్యం

» మంత్రి రవీంద్ర, కొనకళ్ల నారాయణ

» బార్లలో కల్లుగీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్‌పై హర్షం

» ర్యాలీలు, తాటిచెట్లకు పూజలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత కార్మికుల సంఘం సంక్షేమంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గీత కార్మికులకు బార్లలో 10 శాతం రిజర్వేషన్ ప్రకటిస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయంపై ఆదివారం రాత్రి బస్టాండ్ సెంటర్‌లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావులతో కలిసి పలువురు గౌడ సంఘ నేతలు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి తాటిచెట్లకు పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో వైన్‌షాపుల్లో 340 షాపులు కల్లుగీత కార్మికులకు అందించామన్నారు. గౌడ సంఘ అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి ఆధ్వర్యంలో గౌడ కులస్తుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, టీడీపీ ఆవిర్భావం నుంచి గౌడ కులస్తులు పార్టీ విజయానికి అండగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి



బస్టాండ్ సెంటర్‌లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రవీంద్ర, కొనకళ్ల నారాయణ

బాబాప్రసాద్, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణప్రసాద్, కార్పొరేటర్ మరకాని సమతాకీర్తి, శివగంగ పీఏసీఎస్ అధ్యక్షుడు పిప్పళ్ల కాంతారావు తదితరులు పాల్గొన్నారు

బాలికపై లైంగికదాడి నిందితుడు అరెస్టు

మచిలీపట్నం క్రైమ్ : బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని మచిలీపట్నం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గిలకల దిండికి చెందిన పోతురాజు(24) పెయింటింగ్ పనిచేస్తుంటాడు. గ్రామానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బాలికను బెదిరించటంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. బాలిక తల్లిదండ్రులు పోతురాజుపై మచిలీపట్నం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి అతడిపై పోక్సోకేసు నమోదు చేశారు.

బీసీలకు అండగా..

» చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం, బీసీలకు సన్మానం

చల్లపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు అండగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావులు తెలిపారు. ఆదివారం సాయంత్రం చల్లపల్లి ఎన్టీఆర్ పార్కులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి బీసీలు, టీడీపీ నేతలు పాలాభిషేకం చేశారు. అనంతరం కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, నాయీబ్రాహ్మణులను సన్మానించారు.



పాపారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొనకళ్ల నారాయణరావు, కనపర్తి శ్రీనివాసరావు

మిక్కిలినేని మృతి తీరనిలోటు : కొనకళ్ల

కార్మిక, రైతు నాయకులు మిక్కిలినేని పాపారావు మృతి తీరనిలోటని కొనకళ్ల నారాయణ అన్నారు. కార్మిక నాయకులు పాపారావు ఇటీవల మృతిచెందగా.. ఆదివారం చల్లపల్లి వచ్చిన ఆయన పాపారావు కుమారుడు మిక్కిలినేని మధును పరామర్శించారు. పాపారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమాజం పట్ల ఎంతో బాధ్యతతో వ్యవహరించిన పాపారావు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంతగానో పోరాటం చేశారని కొనియాడారు. టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బొబ్బా గోవర్ధన్‌లు మధును పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి మండల టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, వివిధ గ్రామాలకు చెందిన నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రొఫెషనల్ ట్యాక్స్ బాదుడు!

(5వ పేజీ తరువాయి)

వైద్యులు, న్యాయవాదులు, ఇంజనీర్లు, అకౌంటెంట్లు వంటి ప్రొఫెషనల్ కేటగిరీలన్నీ వస్తాయి. అలాగే ట్రేడింగ్ చేసే వ్యాపారులు, స్వతంత్రంగా పనిచేస్తూ ఆదాయ సంపాదించే ఫ్రీలాన్సర్లు, ఆఫీసు బాయ్‌లు, సేల్స్‌మెన్లు, మెడికల్ రిప్రజంటేటివ్స్, క్యాషియర్లు వంటి వారంతా పన్ను పరిధిలోకి వస్తారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో లక్షల సంఖ్యలో వృత్తిపన్నుదారులు ఉన్నారు. ఈ వృత్తిపన్నును 2017 జూన్ ముందు వరకు వాణిజ్య పన్నుల శాఖ వసూలు చేసేది. ఇదే సంవత్సరంలో అమల్లోకి వచ్చిన జీఎస్టీ నేపథ్యంలో, వృత్తిపన్ను వసూలు బాధ్యతను స్థానిక సంస్థలకు అప్పగించారు. స్థానిక సంస్థలు వృత్తి పన్ను వసూళ్లలో ఎందుకో తగిన శ్రద్ధ పెట్టలేదు. దీనికో మెకానిజాన్ని కూడా ఏర్పాటు చేయలేదు. వృత్తిపన్ను కడతామని ముందుకు వచ్చిన వారి దగ్గర కూడా కట్టించుకోలేదు. ఇలా ఏడేళ్లకు పైగా వృత్తిపన్ను వసూళ్లలో అంతులేని నిర్లక్ష్యం నెలకొంది.

తాడేపల్లిలో వేద పాఠశాల

» సెప్టెంబరు 1 నుంచి తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న గుళ్లపల్లి శ్రీరామ కృష్ణమూర్తి

ఘంటసాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామంలోని మలయాళ స్వాముల పెద్దాశ్రమంలో శృతి భారతి వేద పాఠశాలను ఏర్పాటు చేస్తున్నట్టు జాతీయ సాంస్క్రిట్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ గుళ్లపల్లి శ్రీరామ కృష్ణమూర్తి తెలిపారు. సెప్టెంబరు 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కృష్ణమూర్తి మాట్లాడుతూ, ఏర్పేడు పెద్దాశ్రమ పీఠాధిపతి సూచన మేరకు తాడేపల్లి పెద్దాశ్రమంలో వేదపాఠశాల ఏర్పాటుకు అనువైన ప్రాంతంగా భావించినట్టు తెలిపారు. సర్టిఫికెట్ కోర్సు (ఆరు నెలలు), డిప్లొమో కోర్సు (ఏడాది), ప్రాక్ శాస్త్రి (రెండేళ్లు) కోర్సులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఘంటసాల గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ మూల్పూరి వెంకట్రావు - సావిత్రి దంపతులు పాఠశాల ఏర్పాటుకు సహాయసహకారాలు అందిస్తున్నట్టు తెలిపారు. పదోతరగతి చదివిన విద్యార్థులు అర్హులని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలంలోని గిరిజన పల్లెల్లోనూ వేద పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ఎన్ఆర్ఐ మూల్పూరి వెంకట్రావు మాట్లాడుతూ, వేద పరిజ్ఞానాన్ని విస్తృత పర్చాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. సమష్టి కృషితో వేదపాఠశాల కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాతీయ సాంస్క్రిట్ యూనివర్సిటీ నోడల్ ఆఫీసర్ జ్ఞానరంజన్ పాండా, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకటరామకృష్ణ, ఆశ్రమ నిర్వాహకులు కావూరి కోదండ రామయ్య, కొత్తపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ గొర్రెపాటి సురేష్, మొవ్వ శ్రీరామ్మూర్తి, మూల్పూరి వెంకటేశ్వరరావు, యార్లగడ్డ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయ్!

(5వ పేజీ తరువాయి)

వారితో బంధుత్వం, పరిచయాల కారణంగా విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి వివిధ మార్గాల్లో గంజాయిని ఇక్కడకు చేరవేస్తున్నారు. మచిలీపట్నం రైల్వేస్టేషన్ సమీపంలో రైలుబోగీలను శుభ్రపరిచే ప్రాంతంతోపాటు బలరామునిపేట, ఉల్లింగిపాలెం, టెంపుల్ కాలనీ కరగ్రహారం, ఓగీస్‌పేట తదితర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు నిత్యం జరుగుతున్నాయి. మరికొందరైతే తమ గృహాల వద్దనే పరిచయం ఉన్న వ్యక్తులకు మాత్రమే గంజాయి విక్రయాలు చేస్తూ పోలీసులకు పట్టుబడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గంజాయి విక్రయించే వారు రాత్రయితే మచిలీపట్నం బైపాస్ రోడ్డు వెంబడి ఉన్న డంపింగ్ యార్డు, హిందూ శ్మశాన వాటిక, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయించే పనిలో బిజీగా ఉంటున్నారు.

మైనర్ల ద్వారా విక్రయాలు

ఇటీవల మచిలీపట్నం పరిధిలోని మాచవరంలో గంజాయి విక్రయిస్తున్న 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో నలుగురు మైనర్‌లు, ఒక మహిళ ఉన్నారు. పాడేరు నుంచి గంజాయిని తెచ్చి మచిలీపట్నంలో విక్రయిస్తున్నట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ సందర్భంగా గంజాయిని సరఫరా చేస్తున్న వారిని కూడా అరెస్ట్ చేస్తామని పోలీసుల చెప్పి సరిపెట్టేశారు. మచిలీపట్నంలోని దేశాయిపేట సమీపంలోని గోసంఘం వద్ద టిడ్కో గృహ సముదాయాల వెంబడి ఉన్న రెండు బైపాస్ రహదారులపై ప్రతిరోజూ గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎస్ఎన్ గొల్లపాలె నుంచి కాలేఖాన్‌పేట వరకు బైపాస్ రోడ్ల వెంబడి నిర్మానుష్యంగా ఉంటుంది. సాయంత్రమయ్యేసరికి పేకాట రాయుళ్ల బైపాస్‌రోడ్ల పైకిచేరి గంజాయి సేవించి మత్తులో జోగుతున్నా పోలీసులు ఆ వైపునకు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందినవారు గంజాయి విక్రయాల్లో భాగస్వాములుగా ఉండటంతో ఆ వైపునకు పోలీసులు తమ దృష్టిని సారించడం లేదనే విమర్శలున్నాయి. మచిలీపట్నంతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ గంజాయి విక్రయాలు నానాటికీ పెరుగుతున్నాయని, పోలీసులు కఠినంగా వ్యవహరించి గంజాయి విక్రయించేవారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అద్విక 'సిట్'ంగ్!

(5వ పేజీ తరువాయి)

రూ.100 కోట్లకు సంబంధించిన బాధితులు లెక్క తేల్చాల్సి ఉంది.

2వేల మందికి తాఖీదులు

అద్విక కంపెనీలో మొత్తం 2వేల మంది వరకు ఉన్నారు. ఇందులో ఖాతాదారులు, ఏజెంట్లు రెండు వర్గాలుగా ఉన్నారు. కొంతమంది ఖాతాదారులుగా ప్రస్థానం ప్రారంభించి ఏజెంట్లుగా ఎదిగారు. అద్విక కంపెనీ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య బోర్డు తిప్పేసిన తర్వాత బాధితులు మాచవరం పోలీసులను ఆశ్రయించారు. స్టేషన్‌లో పది మంది వరకు బాధితులు ఫిర్యాదులు చేశారు. తర్వాత కేసు టాస్క్‌ఫోర్స్ పరిధిలోకి వెళ్లింది. అద్విక కార్యాలయానికి వచ్చిన బాధితుల నుంచి పోలీసులు ఫిర్యాదులు రాయించి తీసుకున్నారు. తర్వాత ఆదిత్యను కార్యాలయంలో విచారించిన పోలీసులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. ప్రధానంగా కార్యాలయంలో ఎలాంటి రికార్డులు లేకపోవడంతో పోలీసులు తలలు పట్టుకున్నారు. లెడ్జర్లు, డిజిటల్ డేటా ఏమీ లేకుండా ఆదిత్య అన్నింటిని అంతం చేశాడు. దీంతో పోలీసులు ఆదిత్య బ్యాంకు ఖాతాల వివరాలను సేకరించి దాని ఆధారంగా డేటాను సృష్టించుకోవాల్సి వచ్చింది. ఇందు కోసం పోలీసులు రేయింబవళ్లు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఇప్పటికే పోలీసులు కొంతమంది ఏజెంట్లు, ఖాతాదారుల నుంచి వాంగ్మూలాలు నమోదు చేశారు. మొత్తం 150 మంది వాంగ్మూలాలు వరకు నమోదు చేసినట్టు తెలిసింది. ఇప్పుడు కొత్తగా ఏర్పడిన సిట్ అద్విక రికార్డులో నమోదైన రెండు వేల మందికి తాఖీదులు పంపాలని నిర్ణయించింది. ముందుగా ఏజెంట్లకు పిలుపులు వెళ్లబోతున్నాయి. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏజెంట్లు కోట్ల రూపాయల్లో పెట్టుబడులు పెట్టినట్టు చెబుతున్నారు. ఎవరిని కదిపినా నోట కోట్లు తప్ప లక్షలు అన్నమాట వినిపించడం లేదు. తొలుత ఏజెంట్ల వాంగ్మూలాలను నమోదు చేయాలని నిర్ణయించారు. ఒక్కో ఏజెంట్ ఎప్పటి నుంచి అద్వికలో పెట్టుబడులు పెట్టారు, ఎంతమంది ఖాతాదారుల నుంచి డబ్బులు వసూలు చేసి పెట్టుబడులుగా పెట్టించారు అన్న వివరాలను సేకరిస్తారు. తర్వాత ఏజెంట్ల కింద ఉన్న ఖాతాదారులను పిలిపిస్తారు. వారు ఎంత కాలం నుంచి ఎంతమొత్తంలో చెల్లించారు అన్న వివరాలను నమోదు చేస్తారు. ఏజెంట్లు చెప్పిన లెక్కలు, ఖాతాదారులు ఇచ్చిన వివరాలు సమానంగా ఉన్నాయో లేదో చూస్తారు.

206 పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలు

(5వ పేజీ తరువాయి)

ప్రచారం జరుగుతోంది. గ్రామస్థాయిలో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకు జరిగే ఎన్నికలకు, పీఏసీఎస్ కమిటీల నియామకాలకు ముడిపడి రాజకీయ పరిస్థితులు ఉంటాయి. ఇందుకు అనుగుణంగా గ్రామస్థాయి నాయకుల సూచనల మేరకు శాసనసభ్యులు నిర్ణయాలు తీసుకోవాల్సిఉంది. పరిస్థితులను బేరీజు వేసుకుని ఇప్పటి వరకు పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలను నియమించారు.

కేడీసీసీబీ పాలకవర్గ సభ్యుల నియామకానికి మార్గం సుగమం

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 424 పీఏసీఎస్‌లు ఉన్నాయి. వీటికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలను కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కేడీసీసీబీ) పర్యవేక్షిస్తుంది. పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరపకుండా త్రిసభ్య కమిటీలను నియమించారు. పీఏసీఎస్ అధ్యక్షులుగా ఎన్నికైన వారి నుంచే కేడీసీసీబీ చైర్మన్‌ను, పాలకవర్గ సభ్యులను ఎన్నుకుంటారు. ఇటీవల కేడీసీసీబీ చైర్మన్‌గా నెట్టెం రఘురాంను ప్రభుత్వం నియమించింది. పీఏసీఎస్‌లలో పూర్తిస్థాయిలో త్రిసభ్య కమిటీలను నియమించక పోవడంతో కేడీసీసీబీ పాలకవర్గ సభ్యుల నియామకంలో కొంత మేర జాప్యం జరిగింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు అన్ని పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీల నియామకం పూర్తికావడంతో కేడీసీసీబీ పాలకవర్గంలో ఏడుగురు సభ్యులను నియమించేందుకు మార్గం సుగమం అయ్యింది.

పర్యావరణ విధ్వంసం!

(5వ పేజీ తరువాయి)

కలపటంతో పాటు, నీటిలో కూడా కలుపుతారు. ఈ వాసన కారణంగా వనామీ రొయ్య మేతను ఎక్కువగా తింటూ తన పరిమాణాన్ని పెంచుకుంటుంది. రొయ్యలు వేగంగా పెరగటంతో పాటు గణనీయమైన ఉత్పత్తిని ఇస్తాయి. నీటిలో కలపటం వల్ల రొయ్యలకు బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌లను సోకకుండా నిరోధిస్తుంది. రొయ్యల సాగుకు అనుగుణంగా నీటిని ఉంచేలా ఈ హై ఫైడ్ కెమికల్ దోహదపడుతుంది. నీటిలో అమోనియా, నైట్రేట్‌ల స్థాయిలను తగ్గిస్తుంది. నీటిలో ఆక్సిజన్ స్థాయిలను కూడా పెంచుతుంది. రోగాలు తొందరగా రావు. మరణాలు తగ్గుతాయి. దీంతో సాగు ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. సాగుదారుల కోణంలో ప్రయోజనాలున్న హైఫైడ్ కెమికల్ పర్యావరణానికి ఎంతగానో హాని చేస్తుంది.

కుళ్లిపోతున్న మడ చెట్లు

ఈ రసాయనం నీటిని కలుషితం చేస్తుంది. జలచరజీవులకు హాని కలిగిస్తుంది. రొయ్యల సాగు పూర్తయ్యాక.. నీటిని తోడి వేస్తారు. ఇలా తోడి వేసిన నీళ్లన్నీ కూడా మడ చెట్లు ఉండే నీటిలోకి కలుస్తున్నాయి. ఈ ప్రభావం మడచెట్ల మీద ప్రభావం చూపుతోంది. మడచెట్లు ఉండే నీటిలో కలవటం వల్ల చెట్లు కుళ్లిపోయి చనిపోతున్నాయి. మడ చెట్లు అనేవి నీటిని శుద్ధి చేస్తాయి. సముద్రంలోకి వెళ్లే నీటిని కూడా ఇవి శుద్ధి చేస్తాయి. అలాంటి మడచెట్లు హైఫైడ్ రసాయనాల కారణంగా చచ్చిపోతున్నాయి. ఈ రసాయన అవశేషాలున్న రొయ్యలను తినడం వల్ల ఆరోగ్య సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉందని తెలిసింది. ఈ రసాయనాలు శరీరంలోకి ప్రవేశిస్తే క్యాన్సర్, కాలేయ వ్యాధులు వస్తాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. రొయ్యల సాగులో ఇప్పటికిప్పుడు లాభాలను ఇచ్చినా.. మడ చెట్ల వినాశనం ద్వారా పర్యావరణానికి హాని కలగటంతో పాటు మానవ ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మడ అడవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బ్యారేజీకి పెరుగుతున్న వరద

(5వ పేజీ తరువాయి)

నుంచి 14,726 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీని నుంచి కృష్ణా తూర్పు డెల్టా పరిధిలోని కాల్వలకు 10,042 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ డెల్టాకు 6,908, గుంటూరు కెనాల్‌కు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సోమవారం ఉదయం నాటికి లక్ష క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో చేరుతుందని సీడబ్ల్యూసీ ఫోర్‌కాస్ట్ విడుదల చేసింది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

ముగిసిన ఆరోగ్య అవగాహన సదస్సు

గన్నవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాలలో జరుగుతున్న ఆరోగ్య అవగాహన సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, వైద్యంపై అందరికీ అవగాహన ఉండాలని ఆలోచనతోనే ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్యం పట్ల అవగాహన ఎంతో అవసరమన్నారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న రోజులలో ఆరోగ్య విజ్ఞానం ప్రగతి సాధించాలన్నారు. ఇప్పటి వరకూ 26వేల మంది విద్యా ర్థులు ఎగ్జిబిషన్‌ను సందర్శించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్ తెలిపారు. డైరెక్టర్ సీవీరావు, సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.కళ్యాణి శ్రీ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు అభివృద్ధికి కృషి

అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎంపీ వల్లభనేని బాలశౌరి

కంకిపాడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి మాదిరిగా అభివృద్ధి చేసి చూపిస్తామని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. మండలంలోని ఉప్పలూరులో రూ. 70 లక్షలతో నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, విజయవాడ మచిలీపట్నం ప్రధాన రహదారిని ఆరులైన్ల రహదారిగా అభివృద్ధి పరిచేందుకు ఇప్పటికే పక్కా ప్రణాళికలు రూపొందించామని, ఎన్‌హెచ్‌ఏతో కలిసి డ్రెయినేజీ వ్యవస్థను కూడా అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. కంకిపాడు నుంచి గుడివాడ రహదారికి ఇరువైపులా పంట కాలువలు ఉండి నిత్యం కుంగిపోయి రహదారి పాడైపోతుందన్న నేపథ్యంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో మాట్లాడి రైతుల పొలంలో నుంచి గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుకు దాదాపు రూ. 600 కోట్లు మంజూరు చేయించినట్లు తెలియజేశారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, పార్లమెంట్ సభ్యులు బాలశౌరి సహకారంతో రూ. 2.70 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ రాజేష్, ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు వెలగపూడి శంకరబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు చలసాని రాధాకృష్ణ, జనసేన పార్టీ నాయకులు తాతపూడి గణేష్, పులి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కానూరు కేసీపీ కాలనీలో ఎమ్మెల్యే బోడెతో కలిసి సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బాలశౌరి

కానూరు కేసీపీ కాలనీలో..

కానూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. కానూరు కేసీపీ కాలనీలో రూ. 71లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆగిపోయిన అమరావతి అభివృద్ధి పనులకు మరలా గేట్లు తెరిశామన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధి చెందితే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి పెద్దపీట

పెనమలూరు : రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గంలోని రహదారులు, కాలనీలలో రోడ్లు, డ్రైన్ల అభివృద్ధికి పెద్దపీట వేసి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు పెట్టనున్నట్లు ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లు తెలిపారు. ఆదివారం పోరంకి కృష్ణాపురంలో కోటి అరవై లక్షల నిధులతో నిర్మించనున్న ప్రధాన రహదారి, అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీ మాట్లాడుతూ, నిధుల లేమి వెంటాడుతున్నా.. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు రాష్ట్రాన్ని బాగుచేసేందుకు కంకణం కట్టుకున్నారని పేర్కొన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో ఏడాది కాలంలోనే కోట్లాది రూపాయలు తెచ్చి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని ఎంపీ అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, తాతపూడి గణేష్, ముప్పా రాజా, ఏకుల విజయేంద్ర, కాంట్రాక్టరు ప్రసాద్, వడ్లమూడి శుభశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కొయ్యూరు కాలువ పూడికతీత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రామిలేరు నుంచి కొయ్యూరు పెద్ద చెరువుకు నీటి తీసుకువచ్చే డొంక కాలువ పూడికతీత పనులు ఆదివారంతో పూర్తయ్యాయి. కొంత కాలంగా ముళ్లపొదలతో నిండి చెరువుకు నీరు రాక భూగర్భజలాలు కూడా పడిపోవడంతో చెరువు సంఘ అధ్యక్షుడు వెలగ శివప్రసాద్ ఆధ్వర్యంలో మూల్పూరి వీర వెంకట రంగారావు, టీడీపీ అధ్యక్షుడు తూమాటి సాంబశివరావు పర్యవేక్షణలో పూడికతీత పనులు మొదలు పెట్టారు. ఎట్టకేలకు పూడిక తొలగడంతో పెద్ద చెరువుకు నీటి పారుదల మొదలయింది. పూర్తిస్థాయిలో పూడిక తీయడంతో ఆయుకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు.



పూడికతీత పనుల పరిశీలన

గన్నవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే రైతులకు మేలు జరుగుతుందని పార్టీ అధ్యక్షుడు కడియాల రాజశేఖర్ అన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో కొన్ని దశాబ్దాలుగా ఇబ్బందిగా ఉన్న వాగు పూడికతీత పనులు చేపట్టారు. ఆదివారం ఆ పనులను ముస్తాబాద టీడీపీ నాయకులు పరిశీలించారు. పాలడుగు మల్లికార్జునరావు, కొమ్మినేని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

ఉంగుటూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు విద్యుత్ సెక్షన్ పరిధి, 33/11కేవీ నందమూరు సబ్ స్టేషన్ ఏరియాలోని ఇందుపల్లి ఏజీఎల్ వ్యవసాయ ఫీడర్ పీఎంఐ వర్క్ నిమిత్తం సోమవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ(గుడివాడ) ఈఈ జీబీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుపల్లి ఏజీఎల్ ఫీడర్ పరిధిలోని నందమూరు మధిరపాడు, ఇందుపల్లి, వెల్దిపాడు, ఎలుకపాడు తదితర గ్రామాల్లో ప్రతి రోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 3 గంటలవరకు వ్యవసాయానికి నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.



జోజి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి బాలవర్ధనరావు

మాజీ సర్పంచ్ జోజి సేవలు చిరస్మరణీయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మల్లవల్లి మాజీ సర్పంచ్‌గా, పీఏసీఎస్ సీఈఓగా వణుకూరి జోజి అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి బాలవర్ధనరావు అన్నారు. మల్లవల్లిలో ఇటీవల మరణించిన జోజి చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించారు. రైతులందరికీ అందుబాటులో ఉంటూ పీఏసీఎస్ ద్వారా 20 సంవత్సరాలకు పైగా సేవలందించిన వ్యక్తి జోజి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు అక్కినేని ధర్మరాజు, తూము రాధాకృష్ణమూర్తి, అక్కినేని కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో వైసీపీ ఖాళీ

32 మంది టీడీపీలో చేరిక

కంకిపాడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రానున్న రోజుల్లో వైసీపీ ఖాళీ అవుతుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడుకు చెందిన 32 మంది వైసీపీ సానుభూతి పరులు ఆదివారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కంకిపాడుకు చెందిన మైనార్టీ నాయకులు మన్నా ఆధ్వర్యంలో 32 మంది పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, చిట్టూరి నాగేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, ఏనుగ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్ మున్నంగికి అభినందన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు చేరువగా ఉంటూ డొంకరోడ్ల అభివృద్ధితో పాటు మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తానని ఏఎంసీ డైరెక్టర్ మున్నంగి శేషగిరిరావు తెలిపారు.పెరికీడులో డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో రైతు నాయకులు, టీడీపీ నేతలతో కలిసి కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో దంటగుంట్ల సర్పంచ్ యజ్జవరపు వెంకట రంగారావు, పీఏసీఎస్ చైర్పర్సన్ యజ్జవరపు శ్రీనివాసరావు, దన్నే దుర్గారావు, రైతు నాయకులు జాస్తి భూపతి, సూర్యప్రకాష్, చెన్నబోయిన బీరయ్య, టీడీపీ నేతలు దోనె రాము, వేగిరెడ్డి పాపారావు, లింగం పిచ్చేశ్వరరావు, కాలి రమేష్, పొట్లూరి జగన్, సత్తిబాబు పాల్గొన్నారు.



ఉయ్యూరు 2వ వార్డులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైవీబీ రాజేంద్రప్రసాద్

సంక్షేమం, అభివృద్ధి కూటమి లక్ష్యం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీ బీ రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ అసమర్ధ చేతకాని పాలనతో అధోగతి పాలైన రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉయ్యూరు 2వ వార్డులో పర్యటించి ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలు, సంపద సృష్టికి తీసుకుంటున్న చర్యలు ఇంటింటికి వివరించారు. ఉయ్యూరు చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, మాజీ చైర్మన్ ఖుద్దూస్, గుర్నాథరావు, చిరంజీవి, సుబ్బారావు, కుటుంబరావు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

● తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో కాటూరు ఎస్సీ కాలనీలో ఆదివారం పర్యటించి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న దీపం పథకం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు వివరించి ఈ నెల 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయనున్నట్టు ఇంటింటా ప్రచారం చేశారు. పార్టీ నాయకులు శరత్, ఉమాదేవి, యుగబాబు, ఎంపీటీసీ సజ్జా అనూష, సజ్జా మధు పాల్గొన్నారు.



కానూరులో క్రైస్తవుల శాంతి ర్యాలీ

కానూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌ఘడ్‌లో క్రైస్తవ మఠకన్యలపై అక్రమ కేసులకు నిరసనగా ఆదివారం కానూరులో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక కార్మెల్‌మాత చర్చి వద్ద నుంచి కామయ్యతోపు అంబేడ్కర్ విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా కార్మెల్ మాత చర్చి విచారణ గురువు ఫాదర్ సలివేంద్రశౌరి మాట్లాడుతూ, ఇద్దరు మఠకన్యలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రైస్తవులతోపాటు పలువురు గురువులు పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ జాతర

ఉయ్యూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు సుందరమ్మపేటలో ఆదివారం గంగానమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. తూర్పు కాపు సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ మహిళలు నీటి బిందెలతో తరలివచ్చి అమ్మవారికి వారబోసి మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణ మాస ఆదివారం కావడంతో పలు ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చు కున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా కమిటీ ఏర్పాట్లు చేసింది.



గుడి వద్ద మొక్కులు తీర్చుకునేందుకు నీటి బిందెలతో మహిళలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పెరికీడులోని గంగానమ్మతల్లి ఆలయ వార్షిక మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని వీధులకు వేపమండల తోరణాలతో అలంకరించి పోతురాజు గెడను మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గంగానమ్మతల్లిని ప్రత్యేకంగా అలంకరించారు. పుట్టి కోటేశ్వరరావు దంపతులు ప్రత్యేక అర్చన, పూజలు నిర్వహించారు. సేవకురాలు జెట్టి సీతమ్మ అమ్మవారికి సాంబ్రాణి వేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. డప్పు కళాకారుల నృత్యాలు, డీజే సౌండ్స్‌తో గ్రామం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో నక్కా బాబు, నందూరి శర్మ, మెరుగుమాల వేణు, పుట్టి వీర్రాజు, నక్కా గాంధీ, పుట్టి రాంబాబు, తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.



పోతురాజుగెడ ఊరేగింపులో భక్తులు

నేత్ర వైద్యశిబిరానికి అపూర్వ స్పందన



కంకిపాడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : తుమ్మలపల్లి హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి అపురూప స్పందన లభించిందని ఎమ్మె ల్యే బోడె ప్రసాద్ తనయుడు వెంకట్‌రామ్ అన్నారు. కంకిపాడులోని హరికృష్ణ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో సుమారు 500 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బోడె వెంకట్రామ్ మాట్లాడుతూ, ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర ఐ ఆసుపత్రి, బోడె ప్రసాద్ చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో తుమ్మలపల్లి హరికృష్ణ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కంకిపాడు సీఐ మురళీకృష్ణ, ఎస్సైలు డి. సందీప్ తాతాచార్యులు ఉచిత కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, స్థానిక టీడీపీ నాయకులు చిట్టూరి నాగేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, పందిపాటి సుధాకర్, ఏనుగ జయప్రకాష్, వీరంకి శ్యాము, బాజి, ముసిబోయిన బాబు, యలమంచిలి భార్గవ్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు చైర్‌పర్సన్ల నియామకం

ఉయ్యూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రిసభ్య కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గండిగుంట పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా దండమూడి వెంకట నాగేశ్వరరావు, డైరెక్టర్లుగా మాదు వెంకటేశ్వరరావు, శీలం లీలావతి, కలవపాముల పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా కలపాల మల్లేశ్వ రరావు, డైరెక్టర్లుగా నారిశెట్టి సాంబశివరావు, పాగోలు మురళి, బోళ్లపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా గుంటక లక్ష్మీనారా యణరెడ్డి, డైరెక్టర్లుగా తాజేటి యోహాను, కుక్కల చక్రవర్తిని నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారి చేసింది.

ప్రసాదంపాడు: రామవరప్పాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా గోగం వెంకట బాలకోటేశ్వరరావు, సభ్యులుగా పోలిశెట్టి గోపా లరావు, జనపాల శ్యామలరావును నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కంకిపాడు : మండలంలోని గొడవర్రు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా అన్నే శివ రామ ప్రసాద్, సభ్యులుగా ఆకునూరు నాగేశ్వరరావు, రావి సుబ్బారావు (మద్దూరు), కోలవెన్ను పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా వల్లభనేని రాంబాబు, సభ్యులుగా లాం రమేష్, కొణతం నాగమని, కుందేరు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా చలసాని వెంకటేశ్వరరావు, సభ్యులుగా కుప్పల వెంకటేశ్వరరావు, మందపాటి రాంబాబు, నెప్పల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా చలసాని జోగేంద్రనాద్, సభ్యులుగా దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కొత్తూరు వెంకటేశ్వరరావు, పునాదిపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా యార్లగడ్డ వెంకట సుబ్రహమణ్యేశ్వరరావు, సభ్యులుగా గోలి దుర్గా ప్రసాద్, కవిరి రామణయ్య తదితరులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.



అవార్డులు అందుకుంటున్న కుటుంబరాజు, నూకల సాంబశివరావు

కుటుంబరాజు, సాంబశివరావుకు

అల్లూరి, పొట్టి శ్రీరాములు అవార్డులు

ఉయ్యూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు శివాలయం మాజీ చైర్మన్ చింతా వీర వెంకట కుటుంబరాజు, వాకర్స్ అసోసియేషన్ మాజీ జిల్లా గవర్నర్, లయన్స్ క్లబ్ ప్రతినిధి, హెచ్ ఆర్పీ ఎస్ నేషనల్ అడ్వయిజర్లు నూకల వెంకట సాంబశివరావులు హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ సంస్థ నుంచి అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు అవార్డులు అందుకున్నారు. వాకర్స్ అసోసియేషన్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులుగా చేసిన సేవలతో పాటు మరెన్నో సామాజిక సేవలకు గుర్తింపుగా హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ నేషనల్ చైర్మన్, ప్రెసి డెంట్ కొంపల్లి సత్యనారాయణ, సంస్థ నేషనల్ ఇంచార్జ్ బీరెల్లి చంద్రశేఖర్ గుప్తా నుంచి కుటుంబరాజు అల్లూరి సీతారామరాజు స్మారక స్ఫూర్తి అవార్డు, సాంబశివరావు పొట్టి శ్రీరాములు సేవా అవార్డు అందుకున్నారు.

ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందరికీ అందాలి

ఉంగుటూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందరికీ అందే విధంగా నూతన గ్రామకమిటీలు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మంద వేణు మాదిగ అన్నారు. మండలంలోని మధిరపాడు, ఇందుపల్లి గ్రామాల్లో ఆదివారం ఎమ్మార్పీఎస్ సమావేశాలు నిర్వహించారు. మధిరపాడులో మాజీ సర్పంచ్ కొడాలి అజయ్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేణు మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ పోరాట స్ఫూర్తితో సాధించిన వర్గీకరణ ఫలాలు మొత్తం 59 ఉప కులాలకు సమానంగా అందేలా చూడాల్సిన బాధ్యత గ్రామకమిటీలపై వుందన్నారు. మధిరపాడు గ్రామకమిటీ అధ్యక్షులుగా నల్లమోతు జస్వంత్, ఉపాధ్యక్షులుగా తుమ్మపూడి ప్రభుదాసు, ప్రధాన కార్యదర్శిగా కలపాల సురేష్, కార్యదర్శిగా చోరగుడి కరుణాకర్, ప్రచార కార్యదర్శిగా చీలి సురేంద్ర, కార్యవర్గ సభ్యులుగా కొడాలి, పృథ్వి, ఇంటూరి అశోక్, చీలి నాగరాజు, కొడాలి జీవన్‌కుమార్, కొడాలి మధుసూదన్‌రావు, తిరువీధి ఆకాష్, నల్లమోతు యువరాజు, చోరగుడి సుధీర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నేతలు

బీసీల సంక్షేమానికి చంద్రబాబు ప్రాధాన్యం

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమానికి సీఎం చంద్రబాబు ప్రాధాన్యం ఇస్తున్నారని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం పాలసీలో కల్లుగీత కార్మికులకు 10శాతం దుకాణాలు, బార్లు కేటాయించినందుకు హర్షం వెలిబుచ్చుతూ, ఆదివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో టీడీపీ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కల్లుగీత, గౌడ సంఘం, బీసీ సంఘాల నాయకులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. మండల బీసీసెల్ అధ్యక్షుడు రాజులపాటి నాగరాజు, నాయకులు దుట్టా శివన్నారాయణ, కాకుల శ్రీను, మొవ్వా వేణుగోపాల్, వరిగంజి కిషోర్, చెరుకూరి హరికృష్ణ, కడవకొల్లు నాగరాజు, తాడిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

కంకిపాడులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద..

కంకిపాడు : కూటమి ప్రభుత్వంతోనే బీసీల సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని మాజీ ఎంపీపీ, క్లస్టర్ కన్వీనర్ దేవినేని రాజా అన్నారు. కంకిపాడులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గౌడ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పావనమూర్తి, శివయ్య, అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోపీచంద్, అన్నే ధనయ్య, కొండా ప్రవీణ్, సెంగెపు రంగారావు, బొర్రా వెంకట్, తాడిశెట్టి వీరాస్వామి, ఈడే అంజిబాబు, ఈడే కోటేశ్వరరావు, చిన్న, ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దేవినేని రాజా

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

రాటా ప్రతిష్ఠ

గుడివాడ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి రోడ్డు వ్యాపారులు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు యక్కలి మణిదీప్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాల కోసం రాటా ప్రతి ష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆర్యవైశ్య నాయకులు మాటూరి రంగనాథ్, పోకూరి మోహనరావు, తాళ్లూరి సుబ్బారావు, జిల్లా రఘుబాబు, సుగ్రీవు భాస్కర్, శేషు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు

గుడ్లవల్లేరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అంగలూరు కొత్తపేట సెంటర్‌లోని అభయాంజనేయస్వామి మందిరంలో ఉత్సవ విగ్రహాల ఏర్పాటు ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, లక్ష్మీగణపతి సహిత ఆదిత్య, నవగ్రహ శాంతి హోమం, పూర్ణాహుతి, గ్రామోత్సవాలు నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

రైతు పక్షపాతి చంద్రబాబు

పామర్రు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఖాతాల్లో నగదు జమకావడంపై ముఖ్యమంత్రికి రైతులు కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించారు. పామర్రులో తెలుగురైతు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రాక్టర్ల ర్యాలీలో ఎమ్మెల్యే స్వయంగా ట్రాక్టరు నడిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, ఏఎంసీ చైర్మన్ జన్ను శోభన్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు త్వరగా పూర్తి చేయండి

● అధికారులకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆదేశం

కూచిపూడి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రహదారి మరమ్మతులు నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆదేశించారు. అయ్యంకి, కూచిపూడి, మొవ్వ, కోసూరు గ్రామాల మధ్య రహదారులు దెబ్బతినడంతో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. ఆదివారం ఎమ్మెల్యే అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. పార్టీ మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ, బీసీ సంఘ నాయకులు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

గుడ్లవల్లేరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని టీడీపీ నేతలు, మండల బీసీ నాయకులు అన్నారు. ఆదివారం టీడీపీ మండల కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి వారు పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో మద్యం దుకాణాల్లో 10 శాతం గీత కార్మికులకు కేటాయించినందుకు కృతజ్ఞతగా వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకురాలు నూకానమ్మ, జంగం మోహనరావు, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు తూము పద్మజ, ఎస్వీఎస్ ప్రసాద్, అడుసుమిల్లి రామ్మోహనరావు, దివ్యాచౌదరి, పోలవరపు వెంకటరావు, చాపరాల రాజేశ్వరరావు, మండల బీసీ నాయకులు చిట్టిబొమ్మ నరసింహారావు, పామర్తి సత్తిబాబు, బెల్లంకొండ ఏడుకొండలు, ఈడే మోహన్, కాగిత నరేంద్ర, శివకుమార్ పాల్గొన్నారు.

కొండాలమ్మకు వెండి కిరీటం బహూకరణ



వెండి కిరీటం బహూకరిస్తున్న అంగలూరుకు చెందిన భక్తుడు కొలుసు నాగేశ్వరరావు

గుడ్లవల్లేరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వేమవరం కొండాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉద యం 6 గంటల నుంచే భక్తులతో క్యూలైన్లు, దేవస్థాన ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారి ఉత్సవమూర్తికి అంగలూరు గ్రామానికి చెందిన భక్తుడు కొలుసు నాగేశ్వరరావు రూ.72 వేల విలువైన 371 గ్రాముల వెండి, 60 గ్రాముల రాళ్లు పొదిగిన వెండి కిరీటాన్ని బహూకరించారు. కిరీటాన్ని ఆలయ ఈవో ఆకుల కొండలరావు, ఆలయ అర్చకుడు శివసంతోష్ శర్మకు అందజేశారు. వచ్చే శుక్రవారం ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తామని ఈవో తెలిపారు.

అట్లూరి శ్రీరామచంద్రప్రసాద్‌కు పరామర్శ

గుడ్లవల్లేరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పోలిమెట్ల మాజీ సర్పంచ్, నూతనంగా శేరీకల్వపూడి సొసైటీ అధ్యక్షుడిగా నియమితుడైన అట్లూరి శ్రీరామచంద్రప్రసాద్‌ను మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం పరామర్శించారు. శ్రీరామచంద్రప్రసాద్ గుండె సంబంధిత సమస్యకు విజయవాడలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలుసుకుని మంత్రి అక్కడికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కొడాలి రామరాజు, అట్లూరి స్వరూప్,అడుసుమిల్లి దీపక్, మేకా అనిల్ ఆయన వెంట ఉన్నారు.

90 మందికి వైద్య పరీక్షలు

తోట్లవల్లూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గౌడ కమ్యూనిటీహాలులో ఆదివారం గుంటూరు ప్రభుత్వాస్పత్రి వైద్యులు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 90 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జైకృష్ణ, డాక్టర్ శ్యామ్, డాక్టర్ రామనామం శిబిరంలో వైద్య సేవలందించారు. శ్రీవైష్ణవి హౌసింగ్ ఎస్టేట్స్ అండ్ నిర్మాణ సంస్థ శిబిరాన్ని నిర్వహించింది.

ఇంజనీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం

పమిడిముక్కల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): విద్యకు పేదరికం అడ్డుకారాదని, కృషి పట్టుదలతో చదువుకునే వారు ఉన్నతస్థితికి చేరేందుకు ప్రవాసాంధ్రుడు తాతినేని విజయ్‌బాబు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమని లయన్స్‌క్లబ్ ఆఫ్ కపిలేశ్వరపురం అధ్యక్ష, కార్యదర్శులు తాతినేని సాయిదత్, తుమ్మల వెంకటగంగాధరరావు అన్నారు. తాతినేని చారిటబుల్ ట్రస్టు ద్వారా కపిలేశ్వరపురానికి చెందిన తాతినేని విజయ్‌బాబు గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థినికి కళాశాల ఫీజు నిమిత్తం సమకూర్చిన రూ.లక్ష చెక్కును తుమ్మల వెంకట గంగాధర్ ఆదివారం అందజేశారు. మరింత మందికి విజయ్‌బాబు సేవలందించాలని ఆకాంక్షించారు.

నిరుపయోగంగా..

● వల్లూరుపాలెం రక్షిత మంచినీటి పథకం

● రెండేళ్ల నుంచి విద్యుత్ కనెక్షన్ కోసం ఎదురు చూపు

● రూ.7.50 లక్షలు కడితే కనెక్షన్ ● అదీ చెల్లించలేని దుస్థితి

(ఆంధ్రజ్యోతి-తోట్లవల్లూరు): కోట్ల రూపాయలు వెచ్చించి రక్షిత మంచినీటి పథకం ప్రభుత్వం నిర్మించినా విద్యుత్ కనెక్షన్ కోసం రూ.ఏడున్నర లక్షలు చెల్లించలేకపోవడంతో రెండేళ్ల నుంచి పథకం నిరుపయోగంగా ఉంది. ప్రజలు, అధికారులు పాలకుల వైపు చూస్తున్నా ఫలితం లేకపోయింది. వల్లూరుపాలెంలో జల్‌జీవన్ మిషన్ పథకం కింది ఇంటింటికీ కుళాయి ఏర్పాటు లక్ష్యంతో 2021లో 1.20 లక్షల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకం మంజూరయింది. కేంద్ర ప్రభుత్వం రూ.57.25 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ 57.25 లక్షలు కేటాయించటంతో 2022లో ప్రకాశం జిల్లాకు చెందిన కాంట్రాక్టరు బి.రామాంజనేయులు నిర్మాణ పనులు చేపట్టారు. ట్యాంకు నిర్మించి, పక్కనే బోరు వేసి 2023 జూన్ 13వ తేదీతో పని పూర్తయినట్టు బోర్డు పెట్టేశారు. రెండేళ్లు దాటినా ఈ పథకం ప్రజలకు అందుబాటులోకి రాలేదు. పైప్‌లైన్ వేసినా ఒక్కరికి కూడా కుళాయి ఏర్పాటు చేయలేదు. ఐదువేల జనాభా ఉన్న వల్లూరుపాలెంలో పంచాయతీ కార్యాలయం వద్ద 90 వేల లీటర్ల ట్యాంకు, ఎస్టీ కాలనీ వద్ద 30 వేల లీటర్ల ట్యాంకు ఉన్నాయి. ఈ రెండు ట్యాంకుల నుంచి ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీటిని అందించలేని పరిస్థితి ఉంది. కొత్తగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.కోటి 14 లక్షల 50 వేలతో జల్ జీవన్ మిషన్ కింద నిర్మించిన రక్షిత మంచినీటి పథకం త్రీఫేస్ కరెంటు కనెక్షన్ లేక రెండేళ్ల నుంచి ప్రజలకు ఉపయోగం లేకుండా ఉంది.



వల్లూరుపాలెం దళితవాడ వద్ద నిరుపయోగంగా ఉన్న జల్‌జీవన్ పథకం ట్యాంకు



వాటర్ ట్యాంకు వద్ద బోరు



పని పూర్తి చేసినట్టు ఏర్పాటు చేసిన బోర్డు

అధికారులను సంప్రదిస్తున్నా ఫలితం శూన్యం



జల్‌జీవన్ మిషన్ కింద నిర్మించిన ట్యాంకు నుంచి ప్రజలకు తాగునీటిని అందించేందుకు ఎదురుచూస్తున్నాం. కాంట్రాక్టరు ఒక బోరు వేసి మోటారు ఏర్పాటు చేయకుండా వెళ్లిపోయారు. 1.20 లక్షల సామర్థ్యం గల ట్యాంకులో వాటర్ నింపేందుకు రెండు మోటార్లు అవసరం. కాంట్రాక్టరు వీటిని నిర్మించకుండా పని పూర్తిచేసినట్టు వదిలేశారు. అధికారులను సంప్రదిస్తున్నా ఫలితం లేకుండా ఉంది.

- కొనకాల రాజ్యలక్ష్మి, సర్పంచ్

రూ.7.50 లక్షలు ఆన్‌లైన్‌లో ప్రభుత్వం చెల్లించాలి

కరెంటు కనెక్షన్ కోసం రూ.7.50 లక్షలు అవసరమని అంచనా వేయించి ప్రభుత్వానికి పంపించాం. ఆన్‌లైన్‌లో ప్రభుత్వం ఆ నిధులను చెల్లిస్తే విద్యుత్‌శాఖ విద్యుత్ కనెక్షన్ ఇస్తుంది. ఆ తర్వాత మిగతా పనులు చేపడతాం.

- సుబ్బారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ

పీఏసీఎస్‌లకు పాలకవర్గాల నియామకం

పమిడిముక్కల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)కు పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అగినపర్రు సంఘానికి చైర్మన్‌గా చింతమనేని కమలాకరరావు, సభ్యులుగా బోలెం రామచంద్రరావు, కొల్లూరి గోపాలం నియమితులయ్యారు. అమీనాపురం చైర్మన్‌గా కరిమికొండ రవీంద్రబాబు, సభ్యులుగా సయ్యద్ అమీర్, కాసాని రాంబాబు, గోపువానిపాలెం చైర్మన్‌గా యార్లగడ్డ పిచ్చేశ్వరరావు, సభ్యులుగా కొలుసు శ్రీమంతరావు, చింతపల్లి వెంకటసత్యనారాయణ, హనుమంతపురం చైర్మన్‌గా రాజులపాటి రామాంజనేయప్రసాద్, సభ్యులుగా తూట శివపార్వతి, అల్లాడ రాంబాబు, మేడూరు చైర్మన్‌గా గోపిశెట్టి మోహనరావు, తలకటూరి అంజమ్మ, వీరంకి శివవెంకట ఏసుదాసు, కపిలేశ్వరపురం చైర్మన్‌గా తాతినేని బాబూరావు, సభ్యులుగా కాగిత ఉమామహేశ్వరరావు, నల్లూరి చిరంజీవి, పమిడిముక్కల చైర్మన్‌గా మైనేని వెంకటనరేంద్ర, సభ్య లుగా బొడ్డు వెంకటేశ్వరరావు, శొంఠి జయలక్ష్మి నియమితులయ్యా రు.

తోట్లవల్లూరు మండలంలో ఏడు పీఏసీఎస్‌లకు..



కళ్లం వంశీకృష్ణారెడ్డి, చాగంటిపాడు పీఏసీఎస్ చైర్మన్



గూడపాటి గిరిధర్ వెంకటకృష్ణారావు, గరికపర్రు పీఏసీఎస్ చైర్మన్

తోట్లవల్లూరు: మండలంలో ని ఏడు పీఏసీఎస్‌లకు 2026 జనవరి 30 వర కు పాలక వర్గాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చాగంటిపాడు పీఏసీఎస్‌కు చైర్మన్‌గా కళ్లం వశీకృష్ణారెడ్డి, సభ్యులుగా మారుముడి వసంతరావు, చాగంటిపాటి ఏడుకొండలు, బొడ్డపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా నిమ్మగడ్డ వెంకటరత్నం చౌదరి, సభ్యులుగా శరణం కాశీ విశ్వేశ్వరరావు, మార్గం శ్రీరామమూర్తి, దేవరపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా బొమ్ము శివనాగిరెడ్డి, సభ్యులుగా లంకా శ్రీనివాసరావు, రాజులపాటి నాంచారయ్య, గరికపర్రుకు చైర్మన్‌గా గూడపాటి గిరిధర్ వెంకట కృష్ణారావు, సభ్యులుగా బోలెం వీర వెంకటేశ్వరరావు, మండే ఏడుకొండలు, ఐలూరుకు చైర్మన్‌గా దావులూరి వెంకటేశ్వరరావు, సభ్యులుగా జొన్న జగన్మోహన్‌రావు, కమ్మిలి సాంబశివరావు, పెనమకూరుకు చైర్మన్‌గా మరీదు ధర్మారావు, సభ్యులుగా వల్లూరు సమయేలు, లింగాల కోటేశ్వరరావు, వల్లూరుపాలేనికి చైర్మన్‌గా ఆచంట కోటిబాబు, సభ్యులుగా జుజ్జువరపు సంసోను, జిడుగు శ్రీనివాసరావును నియమించింది.

మూడు పీఏసీఎస్‌లకు..

పెదపారుపూడి: యలమర్రు పీఏసీఎస్ అధ్యక్షుడిగా నగుళ్ల శ్రీనివాసరావు, వానపాముల పీఏసీఎస్ అధ్యక్షుడుగా వేములపల్లి నరసింహారావు, వెంట్రప్రగడ పీఏసీఎస్ అధ్యడుగా కూచిపూడి సుబ్బయ్య నియమితులయ్యారు. పెదపారుపూడి, పాములపాడుకు త్వరలో పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించనుంది.

సహకార చట్టం నిబంధనలకు అనుగుణంగా పనిచేయండి

● పీఏసీఎస్ నూతన చైర్మన్లకు గుడివాడ కో-ఆపరేటివ్ సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్ కృష్ణకాంత్ సూచన

పామర్రు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌లకు కొత్తగా నియమితులైన చైర్మన్లు రాష్ట్ర సహకార చట్టం నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని గుడివాడ కో-ఆపరేటివ్ సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్ వింజమూరి కృష్ణకాంత్ సూచించారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డివిజన్ పరిధిలోని 124 పీఏసీఎస్‌లకు గాను తొలివిడతగా గతనెలలో 48 సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించారని తెలిపారు. మిగిలిన 76 సొసైటీల్లో నాలుగు సొసైటీలను పెండింగ్‌లో ఉంచారని మిగిలినవి ప్రకటించారని తెలిపారు. పామర్రు పీఏసీఎస్ చైర్మన్‌గా బొమ్మారెడ్డి నారాయణరెడ్డి, జుజ్జవరానికి జోగి గంటలయ్య, పెదమద్దాలికి దేవరపల్లి రామకోటేశ్వరరావు, ఎలకుర్రుకు కోడే ఉమామహేశ్వరరావు, జమీగొల్వేపల్లికి పొట్లూరి వెంకట సత్యనారాయణను నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయని తెలిపారు.



కూటమి నాయకులతో కలిసి గంగానమ్మ సంబరాల్లో పాల్గొన్న గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

● గంగానమ్మకు గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు పూజలు

గుడివాడ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని గంగానమ్మను కోరుకున్నట్టు గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం పెదవీధిలో ఏలూరు సతీష్, రాజా అజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాల్లో ఆయన పాల్గొని గంగానమ్మ పూజలు చేశారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, నాయకులు మజ్జి శ్రీనివాస్, వేమూరి త్రినాథ్, శాయన రాజేష్ పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పూజలు చేస్తున్న పిన్నమనేని పూర్ణవీరయ్య దంపతులు

రుద్రపాకలో గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ

నందివాడ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో రుద్రపాకలో ఆదివారం గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం వేద పండితుల సమక్షంలో పూర్ణ వీరయ్య దంపతులు హోమం, పంచామృత అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించారు. తర్వాత గ్రామోత్సం నిర్వహించి జాతర ముగించారు. సాయంత్రం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. పోలుకొండలో కురమ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గంగానమ్మ జాతర నిర్వహించారు. రుద్రపాక శివారు గోపాలపురంలో గంగానమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. పిన్నమనేని రామకృష్ణప్రసాద్, మండవల్లి డీసీ చైర్మన్ పాలడుగు నానారావు, నాగభూషణం, మల్లికార్జునరావు, కొండయ్య, తాతయ్య నాని, సాంబశివరావు, నరసింహారావు, కురుమ శ్రీనివాసరావు, నాగరాజు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ జాతర



బల్లిపర్రులో గంగానమ్మకు పూజలు చేస్తున్న అర్చకుడు

పామర్రు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బల్లిపర్రులో గంగానమ్మ జాతరను ఆదివారం గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. 101 బిందెలతో దేవతమూర్తికి అభిషేకాలు చేసి, పూజలు చేశారు. తమ్మారెడ్డి రవీంద్రబాబు, సరోజని దంపతుల ఇంటి వద్ద తొలినైవేద్యాలను సమర్పించారు. తమ్మారెడ్డి సంజీవరావు, సురేష్ పర్యవేక్షించారు.

పామర్రులో..

వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెలమపేటలో గంగానమ్మ జాతర నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికి ప్రాధాన్యమివ్వరా..

● టీడీపీ మండల సమావేశంలో నాయకులు, కార్యకర్తల ఆగ్రహం



టీడీపీ నియోజకవర్గ పరిశీలకురాలు నూకానమ్మకు తమ సమస్యలు వివరిస్తున్న కార్యకర్తలు

గుడ్లవల్లేరు, ఆగస్టు 10 (ఆంధ్ర జ్యోతి): పార్టీ అధికారంలో లేనప్పుడు కష్టపడి, రోడెక్కి పోరాటాలు చేసి కేసులు పెట్టించుకుని కోర్టుల చుట్టూ తిరుగుతున్న కార్యకర్తలను విస్మరించి, కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి, వైసీపీ నుంచి వచ్చిన వారికి నియోజకవర్గ నాయకత్వం ప్రాధాన్యం ఇస్తోందని మండల నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పార్టీ మండల కార్యాలయం వెంకటరామకృష్ణా రైస్‌మిల్ ఆవరణలో నాయకులు, కార్యకర్తలతో సుపరిపాలన కార్యక్రమం నిర్వహణపై టీడీపీ నియోజకవర్గ పరిశీలకురాలు నూకానమ్మ సమీక్ష నిర్వహించారు. అన్ని గ్రామాల నాయకులు తమ ఇబ్బందులు, ఆవేదనను వెల్లిబుచ్చారు. పార్టీకి మండలం కంచుకోట అని, ఇటీవల పార్టీలో నూతన ఒరవడికి నియోజకవర్గ నాయకులు తెరలేపారని ఆరోపించారు. పార్టీ మండల అధ్యక్షుడు బాపయ్య చౌదరిని మార్చే యోచనలో ఎమ్మెల్యే ఉన్నారని, ఆయన మాటకు గత ఏడాదిగా విలువ లేకుండా ఎమ్మెల్యే కార్యాలయం చేస్తోందని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తంచేశారు. బాపయ్యచౌదరిని మారుస్తామని ఎవరన్నారో చెప్పండని కార్యకర్తలను మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ ప్రశ్నించారు. బాపయ్యచౌదరి బలమైన నాయకుడని, ఆయనపై ఎమ్మెల్యే రాముకు గౌరవం ఉందని, ఇక్కడికి వచ్చేడపుడు మాట్లాడానని నూకానమ్మ తెలిపారు. ఆయనను ఎవ్వరూ మార్చరని తెలిపారు. అధిష్ఠానం దృష్టికి సమస్యలు తీసుకెళతానని అన్నారు. త్వరలో పార్టీ మండల అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహిస్తామని ఎమ్మెల్యే అందుకు సుముఖంగానే ఉన్నారని నూకానమ్మ తెలిపారు. '42 ఏళ్లలో మండలంలో పార్టీలో విభేదాలు లేవు. ఇప్పుడు పార్టీలో సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మండల నాయకులను కలుపుకొని ముందుకు వెళితే లుకలుకలు ఉండవు. 22 గ్రామాల్లో పార్టీ ఆదేశానుసారం సంస్థాగత ఎన్నికలు పూర్తి చేస్తే రెండు మూడు గ్రామాల పార్టీ అధ్యక్షులను మార్చేశారు. ఇరువర్గాలనూ, పార్టీ మండల నాయకులను కూర్చోబెట్టి మాట్లాడి సమన్వయపరిస్తే సమస్యలురావు. డైరెక్టుగా ఒకరి పేరును చెప్పి వారిని పెట్టేశామంటూ ఎమ్మెల్యే ఎందుకు తొందరపాటుగా నిర్ణయం తీసుకున్నారో అర్థం కావడం లేదు. ఇక ముందు ఎవరు పార్టీ అధ్యక్షుడిగా ఉన్నా అందరం సహకరించి పార్టీని ముందుకు తీసుకెళ్లాలి.' అని కార్యకర్తలకు టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి సూచించారు. సమస్యలుంటే ఎమ్మెల్యేతో మాట్లాడి పరిష్కరించుకుందామని, పార్టీని బలోపేతం చేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బూత్ కన్వీనర్లే పార్టీని నడుపుతారనుకుంటే పార్టీ మండల అధ్యక్ష పదవిని తీసేయాలని ఆయన అన్నారు. వల్లభనేని బాబూరావు, కొడాలి రామరాజు, తూము పద్మజ, పాలేటి ఆంజనేయులు, ఎస్వీఎస్ ప్రసాద్, బెల్లంకొండ ఏడుకొండలు, వల్లభనేని వెంకట్రావు, వీరమాచనేని శివప్రసాద్, అడుసుమిల్లి రామ్మోహనరావు, శీరం నాగరమేష్, పులి ప్రసాద్, కల్యాణపు నవాబు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)


విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

రెండు బైక్‌లు ఢీ : నలుగురికి గాయాలు

పెడన, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నడుపూరు వద్ద రెండు బైక్‌లు ఎదురెదురగా ఢీకొనడంతో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని పోలీసులు మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. గాయపడిన నలుగురిలో ఇద్దరు నందిగామకు చెందిన పోలగాని పెదబోగయ్య (45), పోలగాని సాయి (25)గా గుర్తించారు.

గోమాతకు అంతిమయాత్ర

చల్లపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి గ్రామానికి చెందిన వేముల శ్రీనివాసరావు, వేముల హరికృష్ణ 20 సంవత్సరాలుగా ఆవును పెంచుకుంటున్నారు. ఆదివారం ఆవు కన్నుమూయటంతో రెండు దశాబ్దాలుగా పెంచుకున్న ఆవుకు కన్నీటి వీడ్కోలు పలికారు. పసుపు, కుంకుమ, చీర సమర్పించి ట్రాక్టర్‌పై మేళతాళాలతో, బాణాసంచాతో ఊరేగింపు చేశారు. నడకుదురు వద్ద కృష్ణానది రేవులో ఖననం చేశారు.



వై.లంకబాబు లక్ష్మీపురం; ఎం.దుర్గామహేష్ వక్కలగడ్డ; జి.వంశీకృష్ణ మేకావారిపాలెం; బి.వీరబాబు చల్లపల్లి; బాలనాగేశ్వరరావు మాజేరు; పి.వెంకటేశ్వరరావు మంగళాపురం; పి.వెంకటేశ్వరరావు పురిటిగడ్డ

బి.పరాత్పరరావు ఘంటసాల; జి.సురేష్ కొత్తపల్లి; జి.వరప్రసాద్ కొడాలి; టి.రాంబాబు శ్రీకాకుళం; నాగేశ్వరరావు లంకపల్లి; ఎం.గంగయ్య బడేవారిపాలెం; పి.కరుణ్‌కుమార్ కోడూరు

ఆర్.పిచ్చేశ్వరరావు వి.కొత్తపాలెం; కె.సుబ్బారావు లింగారెడ్డిపాలెం; తోట సాంబయ్య విశ్వనాథపల్లి; బి.విఠల్‌రావు ఉల్లిపాలెం; కె.సత్యనారాయణ సాలెంపాలెం; పి.రత్నగోపాల్ కె.కొత్తపాలెం; అడపా లతశ్రీ అడపావారిపాలెం

ఎస్.శరత్‌చంద్రబాబు పెదప్రోలు; కె.నాగమల్లేశ్వరావు కోసూరువారిపాలెం; బి.సీతారామప్రసాద్ నాగాయితిప్ప; వై.సుబ్బారావు మెరకనపల్లి; పి.శ్రీనివాసరావు మోపిదేవి; గుత్తికొండ వంశీకృష్ణను అభినందిస్తున్న ప్రముఖులు

నాలుగు మండలాల్లోని పీఏసీఎస్‌ల చైర్మన్లు వీరే

చల్లపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం చైర్మన్లు, పర్సన్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని లక్ష్మీపురం సొసైటీ చైర్మన్‌గా మాజీ ఎంపీపీ యార్లగడ్డ లంకబాబు నియమితులయ్యారు. పర్సన్లుగా తోట రాజేశ్వరరావు, సూదాని పూర్ణచంద్రరావు నియమితులయ్యారు. చల్లపల్లి సొసైటీ చైర్మన్‌గా బొందలపాటి వీరబాబు, పర్సన్‌లుగా ఆలూరి విశ్రాంతమ్మ, వేముల హరికృష్ణ, మేకావారిపాలెం సొసైటీ చైర్మన్‌గా గుత్తికొండ వంశీకృష్ణ, పర్సన్‌లుగా చిటికినేని శ్రీనివాసరావు, వక్కలగడ్డ శివరామకృష్ణ, వక్కలగడ్డ సొసైటీ చైర్మన్‌గా మల్లు పెద్ది దుర్గామహేష్(నాని), పర్సన్‌లుగా బట్టు ప్రసాదరావు, మట్టా రమేష్, పురిటిగడ్డ సొసైటీ చైర్మన్‌గా పెద్దిబోయిన హరనాథ్, పర్సన్‌లుగా బొల్లా జగన్మోహనరావు, యార్లగడ్డ రమేష్‌బాబు, మాజేరు సొసైటీ చైర్మన్‌గా తిరుమలశెట్టి బాలనాగేశ్వరరావు, పర్సన్‌లుగా తిరుమలశెట్టి నాగరాజశేఖర్, యార్లగడ్డ శ్రీరామచంద్రమూర్తి, మంగళాపురం సొసైటీ చైర్మన్‌గా పరుచూరి వెంకటేశ్వరరావు, పర్సన్‌లుగా గొరిపర్తి వెంకటేశ్వరరావు, నిడమానూరి జగన్మోహనరావు నియమితులయ్యారు. మేకావారిపాలెం సొసైటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన గుత్తికొండ వంశీకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు యార్లగడ్డ శ్రీనివాసరావులను డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు, విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు, బుల్లా కిషోర్ సన్మానించి అభినందనలు తెలిపారు.

ఘంటసాల మండలంలో

ఘంటసాల : సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం చైర్మన్లు, పర్సన్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఘంటసాల మండలంలో ఉన్న ఐదు సహకార సంఘాలకు గానూ మూడు టీడీపీకి, రెండు జనసేన పార్టీకి కేటాయించింది. ఘంటసాల పీఏసీఎస్ చైర్మన్‌గా బండి పరాత్పరరావు (టీడీపీ), పర్సన్లుగా దాసరి సీతారామంజనేయ ప్రసాద్, రాజులపాటి వీరాచారి నియమితులయ్యారు. కొత్తపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా గొర్రెపాటి సురేష్ (టీడీపీ), పర్సన్లుగా మండే రవీంద్రబాబు, దోనే నాగమల్లి నియమితులయ్యారు. కొడాలి పీఏసీఎస్ చైర్మన్‌గా గుత్తికొండ గంగాధర సూర్య సత్యనారాయణ వరప్రసాద్ (టీడీపీ), పర్సన్లుగా కంతమనేని రాజగోపాలరావు, వేముపల్లి ప్రకాశరావు, శ్రీకాకుళం పీఏసీఎస్ చైర్మన్‌గా తిరుమలశెట్టి రాంబాబు (జనసేన), పర్సన్లుగా గోపు రాఘవరాజు, భీమరాజు. డి, లంకపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఎనుముల నాగేశ్వరరావు (జనసేన), పర్సన్లుగా పరిశె మనీషా, నండూరి సువర్ణ నియమితులయ్యారు. నూతనంగా నియమితులైన కార్యవర్గ సభ్యులకు మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, జనసేన పార్టీ అధ్యక్షుడు కోన రాజశేఖర్, టీడీపీ నేతలు పరుచూరి సుభాష్ చంద్రబోస్, అయినపూడి భాను ప్రకాష్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, పరిశె చలపతి, తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), దిరిశం వెంకట్రావు, జనసేన నేతలు సిద్ధినేని కుమార్ రాజా, సుగ్గన పవన్, అంకం మారుతీరావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కోడూరు మండలంలో..

కోడూరు : మండలంలో మొత్తం ఏడు పీఏసీఎస్‌లు ఉన్నాయి. వీటిలో నాలుగు జనసేన, మూడు టీడీపీలకు కేటాయించారు. కోడూరు పీఏసీఎస్ చైర్మన్‌గా పూతబోయిన కరుణ కుమార్, బడేవారిపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా మర్రె గంగయ్య, సాలెంపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా కొప్పనాతి సత్యనారాయణ, ఉల్లిపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా బొలిశెట్టి విఠల్‌రావు నియమితులయ్యారు. లింగారెడ్డిపాలెం పీఏసీఎస్ చైర్మన్‌ఆ కోట సుబ్బారావు, వి.కొత్తపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా రేపల్లె పిచ్చేశ్వరరావు, విశ్వనాథపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా తోట సాంబయ్య నియమితులయ్యారు. త్రిసభ్య కమిటీ సభ్యులను కూటమి నాయకులు అభినందించారు.

మోపిదేవి మండలంలో..

మోపిదేవి : మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. మోపిదేవిలో పది పీఏసీఎస్‌లు ఉండగా, ఏడు సంఘాలకు కమిటీలను నియమించారు. మోపిదేవి పీఏసీఎస్‌కు చైర్మన్‌గా పరుచూరి శ్రీనివాసరావు, సభ్యులుగా కారుమూరి ప్రసాద్, కొలుసు శ్రీనివాసరావు, మెరకనపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా యర్రంశెట్టి సుబ్బారావు, సభ్యులుగా అంబటి లక్ష్మీ, కర్రా వెంకటేశ్వరరావు, నాగాయితిప్ప చైర్మన్‌గా బళ్లా సీతారామ ప్రసాద్, సభ్యులుగా రేపల్లె మునీశ్వరరావు, గరికపాటి రాఘవయ్యలను ఎంపిక చేశారు. పెదప్రోలు పీఏసీఎస్ చైర్మన్‌గా నాదెళ్ల శరత్ చంద్రబాబు, సభ్యులుగా ఎడ్లపల్లి నాగమల్లేశ్వరరావు, మోర్ల జయ నాగ శ్రీనివాసరావు, అడపావారిపాలెం చైర్మన్‌గా అడపా లతశ్రీ, సభ్యులుగా కళ్లేపల్లి లక్ష్మీ నాంచారయ్య, ఆళ్ల లక్ష్మీనాంచారయ్యలను నియమించారు. కోసూరువారిపాలెం చైర్మన్‌గా కోసూరు నాగమల్లేశ్వరరావు, సభ్యులుగా గొరిపర్తి పిచ్చేశ్వరరావు, బడే నాగ బసవయ్య, కె.కొత్తపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా పూషడపు రత్నగోపాల్, సభ్యులుగా మల్లవోలు రమేష్ నాంచారయ్య, మాతంగి ప్రసాద్ నియమితులయ్యారు.

రక్తదానం మహోన్నతం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం మహోన్నతమని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత అన్నారు. మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బెల్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఆశాలత శిబిరాన్ని ప్రారంభించి ప్రసంగించారు. న్యాయవాది లంకిశెట్టి బాలాజీ రక్తదానం చేశారు. మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు వేణుకుమార్ అధ్యక్షతన జరిగిన శిబిరంలో బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి డాక్టర్ పావని, గౌరవాధ్యక్షుడు ఏఆర్‌కె వరప్రసాద్, ఉపాధ్యక్షుడు కాసాని ప్రసాద్, సహకార్యదర్శి దీప్తి, బ్లడ్ కమిటీ చైర్మన్ రమాదేవి, ఫుడ్ కమిటీ చైర్మన్ అనిల్, రామకృష్ణ, నిరంజనరావు తదితరులు పాల్గొన్నారు.